క్లుప్తంగా

మంగళకారిణి.. సౌభాగ్యప్రదాయిని


గాజుల అలంకరణలో రాస పోలమాంబ

తగరపువలస: భీమిలి మండలం మజ్జివలస గ్రామదేవత రాస పోలమాంబ అమ్మవారిని సంక్రాంతి సందర్భంగా గాజులు, తులసిమాలలు, గజమాలలు, చెరకుగడలతో అలంకరించారు. కృష్ణంరాజుపేటకు చెందిన తుపాకుల చిన్నయ్య, సత్యవతి దంపతులు ఈ అలంకరణకు సహకారం అందించారు. మజ్జివలసకు చెందిన తుపాకుల అప్పల రాసయ్య, రాసమ్మ దంపతులు ప్రసాదాలు పంపిణీ చేశారు.

విద్యుత్ బిల్లుల వసూళ్లకు ప్రత్యేక కేంద్రం నేడు

తగరపువలస: ఆనందపురం సెక్షన్ వేములవలస వద్ద గురువారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ బిల్లుల వసూళ్ల కోసం ప్రత్యేక కేంద్రం ఏర్పాటు చేశారు. ఈ అవకాశాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని విశాఖ జోన్-3 ఈఈ (ఆపరేషన్స్) పి.శ్రీనివాసరావు కోరారు.

కబడ్డీ విజేతలకు నగదు బహుమతులు


విజేతలకు కప్ అందజేస్తున్న ఎంపీపీ రాంబాబు


పద్మనాభం: సంక్రాంతి సందర్భంగా మండలంలోని మద్దిలో మూడు రోజులు నిర్వహించిన కబడ్డీ పోటీలు విజయవంతంగా ముగిశాయి. విజయనగరం, విశాఖపట్నం జిల్లాల క్రీడాకారులు ఉత్సాహంగా పోటీల్లో పాల్గొన్నారు. విజేతలకు ఎంపీపీ కంటుబోతు రాంబాబు, వైఎస్సార్ సీపీ మండల యువజన విభాగం అధ్యక్షుడు బుగత సత్యనారాయణ ట్రోఫీలు, నగదు బహుమతులను అందజేశారు. ప్రథమ స్థానంలో నిలిచిన జామి టీమ్‌కు రూ.7వేలు, ద్వితీయ స్థానంలో నిలిచిన వీఆర్ పేట టీమ్‌కు రూ.5వేలు, తృతీయ స్థానంలో నిలిచిన నరవ టీమ్‌కు రూ.3వేలు నగదు, కప్ అందజేశారు.

పరుగులు పెట్టించిన కోతి


తిమ్మాపురం వద్ద ప్రయాణికులను బెంబేలెత్తించిన కోతి

కొమ్మాది: భీమిలి బీచ్ రోడ్డు తిమ్మాపురం వద్ద ఒక కోతి ప్రయాణికులను బెంబేలెత్తించింది. భీమిలి నుంచి వైజాగ్ వైపుగా వెళ్తున్న వాహనాల వెంట పరుగెడుతూ ఆందోళనకు గురి చేసింది. రెండు గంటల పాటు పలువురు ప్రయాణికులను పరిగెత్తించిన ఈ కోతిని స్థానిక యువకులు కర్రలతో భయపెట్టి దూరంగా తరిమివేయడంతో, అంతా ఊపిరి పీల్చుకున్నారు.

వామనుడిగా అప్పన్న



సింహాచలం: సింహగిరిపై జరుగుతున్న రాపత్తు ఉత్సవాల్లో భాగంగా ఐదోరోజు మంగళవారం శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి వామనాలంకారంలో దర్శనమిచ్చారు. స్వామివారి ఉత్సవ మూర్తి గోవిందరాజస్వామికి వామనుడి అలంకరణ చేశారు. శ్రీదేవి, భూదేవి సమేతంగా పల్లకీలో అధిష్ఠింజేశారు. ఆళ్వారులను వేరొక పల్లకీలో కొలువుంచి, సింహగిరి మాడ వీధిలో సాయంత్రం తిరువీధి వైభవంగా నిర్వహించారు.

సందడే సందడి

ప్రారంభమైన పరసల పరంపర


సిగడాం మహాలక్ష్మి అమ్మవారి తీర్థంలో..


అచ్చియ్యమ్మ పేరంటాలు తీర్థంలో ఏర్పాటు చేసిన స్టాల్స్ వద్ద సందడి


అమ్మవారికి పూజలు చేస్తున్న ధర్మకర్తలు, భక్తులు

మధురవాడ: పండగ వేళ తీర్థాలతో అంతటా సందడి నెలకొంది. సంక్రాంతితో మొదలైన ఈ పరసల పరంపర శివరాత్రి వరకు కొనసాగనుంది. మధురవాడ జోనల్ కార్యాలయం సమీపంలో ఉన్న అచ్చియ్యమ్మ పేరంటాలు తీర్థం బుధవారం సాయంత్రం వైభవంగా జరిగింది. అమ్మవారి ఆలయంలో ధర్మకర్తలు అల్లాడ ఉమామహేశ్వరరావు, అల్లాడ వెంకటరావు, సూర్యారావు, గంగరాజు, లింగేశ్వరరావు తదితరుల పూజలు ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. అనంతరం మధురవాడ పరిసర 14 గ్రామాలతో పాటు పదుల సంఖ్యలో కాలనీకి చెందిన ప్రజలు విశేషంగా తరలి వచ్చారు. సాయంత్రం ఆలయ ఆవరణలో చెక్క భజన, సత్యహరిశ్చంద్ర నాటకం అలరించాయి. పిల్లల బొమ్మలు మొదలుకుని చెరుకు గెడలు, వివిధ రకాల వస్తువులతో ఏర్పాటు చేసిన స్టాల్స్ వద్ద సందర్శకుల సందడితో కొమ్మాది జంక్షన్-మధురవాడ జంక్షన్‌ల మధ్య గల ప్రాంతం కోలాహలంగా మారింది.

వైభవంగా మహాలక్ష్మి తీర్థం

తగరపువలస: జీవీఎంసీ రెండోవార్డు చిల్లపేటలోని సిగడాం మహాలక్ష్మి తీర్థం బుధవారం సాయంత్రం సందడిగా జరిగింది. ప్రతి కనుమ పండగకు ఇక్కడ అమ్మవారి పేరుమీద తీర్థం జరపడం ఆనవాయితీగా వస్తోంది. దీంతో ఆలయ పరిసరాలలో వివిధ దుకాణాలు వెలిశాయి. ఈ తీర్థాన్ని చూసేందుకు చుట్టుపక్కల గ్రామాలకు చెందిన పిల్లలు, పెద్దలు వచ్చి సందడి చేశారు. ఆటవస్తువులు, చెరకుగడలు, శనగలు, బెలూన్లు, ఐస్ క్రీమ్‌లు కొనుగోలు చేశారు. చిల్లపేట పరిసరాలు యువత కేరింతలతో దద్దరిల్లిపోయింది. ఈ తీర్థంలో ప్రొ కబడ్డీ తెలుగు టైటాన్స్ జట్టు సీఈవో జీరు త్రినాథరెడ్డి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. యువకులు ఈయనతో పోటీపడి సెల్ఫీలు దిగారు.

ఘనంగా ముత్యాలమ్మ తిరునాళ్లు

పద్మనాభం: మండలంలోని గంధవరంలో ముత్యాలమ్మ తిరునాళ్లు ఘనంగా జరిగాయి. కొండపై కొలువై ఉన్న ముత్యాలమ్మను భక్తులు దర్శించుకుని పూజలు చేశారు.


బొమ్మల స్టాల్ వద్ద చిన్నారులు, సందర్శకులు


చిల్లపేటలో యువకులతో ప్రొ కబడ్డీ తెలుగు టైటాన్స్ సీఈవో త్రినాథరెడ్డి


తీర్థంలో దుకాణాలు

ఊరంతా సంక్రాంతి


సినీ దర్శకుడు ఇమంది రామారావును సన్మానిస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు


సింహాద్రి అప్పన్న ఆశీర్వచనాలు అందిస్తున్న గంగిరెద్దుల వారు


పతంగుల పండగలో పాల్గొన్న పిల్లలు, పెద్దలు


శిల్పారామంలో నృత్య ప్రదర్శన

సంక్రాంతి పండగ సందడిగా సాగింది. సంక్రాంతి, కనుమ పండుగలను భీమిలి నియోజకవర్గ వాసులు కనులపండువగా జరుపుకొన్నారు. కొత్తల్లుళ్ల రాకతో ఇళ్లు కళకళలాడాయి. పిండివంటలు ఘుమఘుమలాడాయి. బుడబుక్కలవాళ్లు, గంగిరెద్దుల వాళ్లు, దాసరికం చేసేవారు ఇంటింటా తిరుగుతూ ఆశీర్వాదాలు అందించారు. అతివలు ఇళ్ల ముందు అందమైన రంగవల్లులను తీర్చిదిద్దారు. శివారు గ్రామాలు యథావిధిగా కోళ్ల పందాలు, పేకాటలతో సందడిగా గడిచాయి. చిట్టివలస ఫ్రెండ్స్ ఫౌండేషన్ ప్రతినిధులు సంక్రాంతి సంబరాలలో భాగంగా కుర్చీలాట, కుండల పోటీ, ఫ్యాన్సీ డ్రెస్ కాంపిటీషన్ నిర్వహించి బహుమతులు అందించారు. ఈ ప్రాంతానికి చెందిన సినీ దర్శకుడు, విమర్శకుడు ఇమంది రామారావును ఘనంగా సత్కరించారు. భీమిలి బీచ్‌లో పతంగుల పండగ ఉత్సాహంగా జరిగింది. భీమిలి ప్రెస్ క్లబ్ మరియు ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆఫ్ భీమిలి(ఫ్యాబ్) ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పిల్లలు, పెద్దలు సరదాగా పతంగులను ఎగరవేశారు. మధురవాడ శిల్పారామం (జాతర)లో సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. విశాఖపట్నంలోని జోష్ డ్యాన్స్ అకాడమీకి చెందిన కళాకారుల శాస్త్రీయ, జానపద నృత్యాలు అలరించాయి. మురళి గోవింద్ పర్యవేక్షణలో నిర్వహించిన కార్యక్రమాలను శిల్పారామం అధికారి టి.విశ్వనాథరెడ్డి పర్యవేక్షించారు.

– తగరపువలస/ భీమునిపట్నం/పీఎం పాలెం

సంక్రాంతి పోటీల విజేతలకు బహుమతుల ప్రదానం


ఫ్యాన్సీ డ్రెస్ పోటీల విజేతకు బహుమతి అందజేస్తున్న గ్రామ పెద్దలు, జడ్జిలు

మధురవాడ: చంద్రంపాలెంలో సంక్రాంతి ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా ఇక్కడ నిర్వహించిన భోగి మంటలు మొదలుకుని గంగిరెద్దుల విన్యాసాలు, కోలాటం, ముగ్గుల పోటీలు, ఫ్యాన్సీ డ్రెస్, డ్యాన్స్ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. గ్రామ పెద్దలు, యువత, మహిళలు సంయుక్తంగా నిర్వహించిన పోటీలకు న్యాయ నిర్ణేతలుగా ఉపాధ్యాయిని ప్రభావతి, సీనియర్ జర్నలిస్ట్ రామునాయుడు వ్యవహరించారు. పోటీల్లో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన వారికి బహుమతులు అందించారు. రంగోలిలో యు.రాజ్యలక్ష్మి, పోతిన హర్షిత, కర్రి అనూష, ఫ్యాన్సీ డ్రెస్‌లో మరుపిల్లి లాస్య భార్గవి, జగ్గుపిల్లి రమ్యశ్రీ, జగ్గుపిల్లి అభి, డ్యాన్స్‌లో పిళ్లా సాయిరిషిత, పిళ్లా ఆరాధ్య, పోతిన ధన్వి నిలిచారు. విజేతలకు నిర్వాహకులు బహుమతులు అందజేశారు.

120 మందికి పౌర సత్కారం


ఉత్తమ రైతు రామకృష్ణను సన్మానిస్తున్న గ్రామస్తులు

పద్మనాభం: విలాస్కాన్‌పాలెంలో బుధవారం రాత్రి ఉత్తమ రైతు కంటుబోతు రామకృష్ణతో పాటు 120 మందికి పౌర సత్కారం జరిగింది. వివిధ రంగాల్లో విశేష సేవలందిస్తున్న 120 మందిని ఎంపిక చేసి, గ్రామస్తులందరూ కలిసి దుశ్శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో బోని సన్యాసినాయుడు, కాళ్ల శ్రీనివాసరావు, రామసింగు ముత్యాలప్పడు, బాయి అప్పలస్వామి, రామసింగు కృష్ణ పాల్గొన్నారు.

భక్తితో అనంతుని గిరి ప్రదక్షిణ


ఇసకలపాలెంలోని పూలతోటలో ఉభయ దేవేరులతో విహరిస్తున్న రంగనాయకులు

పద్మనాభం: పద్మనాభంలో అనంత పద్మనాభ స్వామి గిరి ప్రదక్షిణ బుధవారం కనులపండువగా జరిగింది. కుంతీ మాధవ స్వామి ఆలయంలోని శ్రీదేవి భూదేవి సమేత రంగనాయకుల ఉత్సవ విగ్రహాలను పల్లకీలో కుంతీ మాధవ స్వామి ఆలయం చుట్టూ తిప్పారు. తదుపరి అనంత పద్మనాభ స్వామి గిరి చుటూ తిప్పారు. పద్మనాభం, ఇసకలపాలెం, అర్చకునిపాలెం గ్రామాల మీదుగా గిరి చుట్టూ ఉభయ దేవేరులతో స్వామివారిని పల్లకీలో ప్రదక్షిణ చేయించారు. అడుగడుగునా భక్తులు స్వామిని పూజించారు. ఇసకలపాలెంలో ఉన్న పూల తోటలో స్వామి కాసేపు విహరించారు. పద్మనాభంలోని జిల్లా పరిషత్ బంగ్లాకు సమీపంలోని ఉన్న ఉయ్యాల కంబాల వద్ద ఉయ్యాల ఊగారు. కార్యక్రమంలో పద్మనాభం సర్పంచ్ తాలాడ పాప, తాలాడ పద్మనాభం, కాళ్ల నగేష్ కుమార్, కంటుబోతు ఎర్నాయుడు, హంస మహేష్ పాల్గొన్నారు.

నృసింహునికి ప్రత్యేక పూజలు


నృసింహునికి కాళ్లు కడిగి పూజలు చేస్తున్న మహిళ

పద్మనాభం: మండలంలోని విలాస్కాన్‌పాలెంలో సింహాద్రి అప్పన్న ప్రతిరూపమైన నృసింహునికి మహిళలు మంగళవారం కాళ్లు కడిగి పూజలు చేశారు. విశాఖపట్నం శివాజీపాలేనికి చెందిన ఈ నృసింహునితో పాటు బృంద సభ్యులు తొమ్మిది మందిని విలాస్కాన్‌పాలేనికి చెందిన రామసింగ వారి కుటుంబ సభ్యులు గ్రామంలోకి తీసుకు వచ్చారు. నృసింహుని ఊరంతా తిప్పారు. ప్రతి ఇంటికీ తీసుకు వెళ్లారు. మహిళలు నృసింహునికి కాళ్లు కడిగి పూజలు చేశారు. బృంద సభ్యులు సింహాద్రి అప్పన్నను స్తుతిస్తూ గీతాలు ఆలపించారు. కార్యక్రమంలో రామసింగు నాగేశ్వరరావు, రామసింగు అప్పలనాయుడు, పవన్, శివ, సత్య పాల్గొన్నారు.

పాలిథిన్ నిషేధం ప్రచారానికే పరిమితం

ప్రజల్లో కానరాని చైతన్యం


సబ్బివానిపేట వద్ద పాలిథిన్‌తో నిండిపోయిన హైవే డ్రైనేజీ

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్‌లో పాలిథిన్ నిషేధంపై శానిటేషన్ సిబ్బంది 45 రోజులుగా విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. ఇంటింటా, దుకాణాల వెంట తిరుగుతూ కరపత్రాలు పంపిణీ చేస్తూ పాలిథిన్ నిషేధంపై అవగాహన కలిగిస్తున్నారు. మరోవైపు ఇంటింటా చెత్త సేకరణలో భాగంగా ప్రతిరోజూ వాహనాలు వీధులలో, రహదారులపై పరుగులు తీస్తున్నాయి. నోరు నొప్పి వచ్చేలా అరుస్తున్నారు. విజిల్ వేస్తున్నారు. అయినప్పటికీ వీధులలో, రహదారులపై, డ్రైనేజీలలో పాలిథిన్‌తో పాటు ఖాళీ మద్యం సీసాలు, డ్రింక్ బాటిళ్లు, ఖాళీ పౌచ్‌లు పేరుకుపోతున్నాయి. దీంతో మురుగునీటి ప్రవాహానికి ఇబ్బంది ఏర్పడి, మురుగు రోడ్డెక్కుతుంది. డ్రైనేజీలపై సిమెంట్ శ్లాబ్ నాణ్యత లేకపోవడంతో ఎక్కడికక్కడ విరిగిపోతున్నాయి. దీంతో స్థానికులు కొందరు ముందున్న ప్రమాదాన్ని గ్రహించకుండానే చెత్తను తెచ్చి తెరచి ఉన్న డ్రైనేజీలలో వేస్తున్నారు. పాలిథిన్, చెత్త సేకరణపై ప్రజల ధోరణి మారే వరకు ఇలాంటి సమస్యలు వేధిస్తూనే ఉంటాయని పర్యావరణ ప్రేమికులు అంటున్నారు. కనీసం చదువుకున్న వారైనా మారి చెత్తను వాహనాలతో వచ్చే శానిటరీ సిబ్బందికి ఇవ్వడంతో పాటు పాలిథిన్‌కు బదులుగా కాగితపు, వస్త్ర సంచులు వినియోగించాలని కోరుతున్నారు.

నేత్రపర్వం.. మకరజ్యోతి దర్శనం


ఆలయం వద్ద వెలుగుతున్న మకర జ్యోతి


ప్రత్యేక అలంకరణలో స్వామి

భీమునిపట్నం: భీమిలి బీచ్ వద్దనున్న అయ్యప్ప స్వామి దేవాలయంలో మంగళవారం సాయంత్రం మకరజ్యోతి కార్యక్రమం ఘనంగా జరిగింది. ఇక్కడ అయ్యప్ప సేవా సంఘం ఆధ్వర్యంలో ముందుగా స్వామివారికి ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకాలు చేశారు. సాయంత్రం 6 గంటల 18 నిమిషాలకు ఆలయం ఎదురుగా మకర జ్యోతిని వెలిగించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

వ్యర్థాలు.. గుట్టలై..


రోడ్డు పక్కన వేసిన భవన నిర్మాణ వ్యర్థాలు

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు సుభాష్‌నగర్ నుంచి బీచ్ రోడ్డుకు వెళ్లే మార్గంలో రోడ్డు వెంబడి భారీ స్థాయిలో డెబ్రిస్‌ను వేశారు. ఈ ప్రాంతాల్లో పెద్ద ఎత్తున నిర్మాణాలు సాగుతున్నాయి. ఈ క్రమంలో వాటికి సంబంధించిన రాయి, ఇసుక, ఇటుకలు, సిమెంట్ పెంకులు వంటివి రాత్రి సమయాల్లో లారీల ద్వారా తీసుకువచ్చి ఇక్కడ వదిలివేస్తున్నారు. దీంతో ఇటుగా వెళ్తున్న ప్రయాణికులకు ఇబ్బందికరంగా మారుతోంది. ధూళి ఎగురుతూ అవస్థలకు గురి చేస్తోంది. సంబంధిత అధికారులు స్పందించి దీనిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

రహదారులు నిర్మానుష్యం

- కార్మిక వాడ ఖాళీ
- వెలవెలబోయిన పర్యాటక ప్రాంతాలు


బోసిపోయిన తగరపువలస ప్రధాన రహదారి


పరిమిత సంఖ్యలో పర్యాటకులతో రుషికొండ బీచ్


వెలవెల పోతున్న జాతీయరహదారి


సందడి లేని ప్రైవేట్ మార్కెట్

తగరపువలస: సంక్రాంతి, కనుమ పర్వదినాలను పురస్కరించుకుని చిట్టివలస కార్మికవాడ బుధవారం బోసిపోయింది. ఉద్యోగం, ఉపాధి, వ్యాపారాల కోసం ఈ ప్రాంతానికి వచ్చిన వారు పండగ నిమిత్తం సొంత గ్రామాలకు వెళ్లడంతో తగరపువలస ప్రధాన రహదారి, జాతీయ రహదారి, ప్రైవేట్ మార్కెట్ నిర్మానుష్యంగా మారాయి. స్థానిక క్వారీ, రవాణా, విద్యాసంస్థల వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. దూర ప్రాంతాలకు వెళ్లే రవాణా వాహనాలతో పాటు ప్రైవేట్ ట్రావెల్స్, ఆర్టీసీ బస్సులు పాక్షికంగా నడిచాయి. భీమిలి నియోజకవర్గంలో నడిచే సిటీబస్సులు ప్రయాణికులు లేక ఖాళీగా కనిపించాయి. వ్యాపారం సాగకపోవడంతో ఉదయం వరకు తెరచుకున్న దుకాణాలు మధ్యాహ్నం తరువాత మూతపడ్డాయి. కనుమ పండగ కావడంతో మద్యం దుకాణాలు, చికెన్, మటన్ షాపుల వ్యాపారం ఉదయం వేళ బాగా జరిగింది.

వెలవెలబోయిన పర్యాటక ప్రాంతాలు

కొమ్మాది: భీమిలి బీచ్ రోడ్డు వెంబడి ఉన్న పలు పర్యాటక ప్రాంతాలు వెలవెలబోతున్నాయి. సంక్రాంతి సందర్భంగా నగరవాసులు పల్లెబాట పట్టడంతో సాగర్‌నగర్ బీచ్, రుషికొండ బీచ్, తొట్లకొండ, ఎర్రమట్టి దిబ్బలు, భీమిలి బీచ్ వంటి ప్రాంతాలు పర్యాటకులు లేక వెలవెలబోతున్నాయి.

నిర్మాణంలోనే రింగురోడ్డుకు పగుళ్లు


లక్ష్మీపురం వద్ద సీసీ రోడ్డుకు ఏర్పడిన పగుళ్లు

తగరపువలస: భీమిలి మండలం లక్ష్మీపురం పంచాయతీలో సుమారు రూ.కోటితో నిర్మిస్తున్న రింగురోడ్డు పనులు పూర్తికాక ముందే పగుళ్లు ఏర్పడ్డాయి. లక్ష్మీపురం, శింగనబంధ, నారాయణరాజుపేట పంచాయతీ వాసులకు సౌకర్యంగా ఉండేందుకు గాను రేవిడి రోడ్డు నుంచి లక్ష్మీపురం కళ్లాలు, శింగనబంధ చెరువును ఆనుకుని లక్ష్మీపురం గ్రామ సచివాలయం వరకు ఈ రోడ్డును నిర్మిస్తున్నారు. ప్రస్తుతం చెరువు మార్గంలో రక్షణగోడ నిర్మాణం జరుగుతోంది. ఇంకా 20 శాతం పనులు మిగిలి ఉన్నాయి. ఇటీవల లక్ష్మీపురానికి చెందిన లారీ యజమాని ఈ నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డుపై 60 టన్నుల బరువు లోడుతో లారీని తీసుకువెళ్లడంతో రహదారి పగిలిపోయినట్టు స్థానికులు తెలిపారు. దీనిపై మండల పరిషత్ అధికారులు లారీ యజమానికి నోటీసు పంపించినట్టు తెలిసింది.